بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ     نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ     وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

Full Text of Friday Sermon Hazrat Khalifatul Masih V, 18 Sep 2026 (Telugu)

# అల్లాహ్ తఆలాను నమ్ముకొనుట గురించి
# మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర జీవితం ఆధారంగా గొప్ప ఆదర్శం

**హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 18.09.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సర్రే) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشۡهَدُ أَنۡ لَّاۤ إِلٰهَ إِلَّا اللّٰهُ وَحۡدَهٗ لَا شَرِيۡكَ لَهٗ وَأَشۡهَدُ أَنَّ مُحَمَّدًا عَبۡدُهٗ وَرَسُوۡلُهٗ۔ أَمَّا بَعۡدُ فَأَعُوۡذُ بِاللّٰهِ مِنَ الشَّيۡطٰنِ الرَّجِيۡمِ۔
بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ۞ اَلۡحَمۡدُ لِلّٰهِ رَبِّ الۡعٰلَمِيۡنَ ۞ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ۞ مٰلِكِ يَوۡمِ الدِّيۡنِ ۞ اِيَّاكَ نَعۡبُدُ وَاِيَّاكَ نَسۡتَعِيۡنُ ۞ اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِيۡمَ ۞ صِرَاطَ الَّذِيۡنَ اَنۡعَمۡتَ عَلَيۡهِمۡ غَيۡرِ الۡمَغۡضُوۡبِ عَلَيۡهِمۡ وَلَا الضَّآلِّيۡنَ ۞

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంనకు అల్లాహ్ తఆలాపై ఉన్న నమ్మకం గురించి ప్రస్తావిస్తూ గడిచిన ఖుత్బాలో నేను ఆయన మక్కా నుండి చేసిన వలస సంఘటనలను వివరించాను. ఈ ప్రయాణానికి సంబంధించిన మరికొన్ని వివరాలు కూడా చరిత్రలో లభిస్తాయి, ఇవి ఆయన నమ్మకపు ఘనతను మరింత స్పష్టంగా చాటిచెబుతాయి.

వలస సమయంలో, ఖురైషీలు ప్రకటించిన బహుమతి ఆశతో సురాఖా బిన్ మాలిక్ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మరియు హజ్రత్ అబూ బకర్ రజియల్లాహు అన్హులను వెంటాడారు. సురాఖా తరువాత ముస్లింగా మారారు మరియు ఆయన స్వయంగా ఈ సంఘటనను వివరించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మరియు హజ్రత్ అబూ బక్ర్ (రజి) లను సజీవంగా గానీ లేదా మృతదేహాలుగా గానీ పట్టుకున్న వారికి ఖురైషీలు చెరో వంద ఒంటెలను బహుమతిగా నిర్ణయించారు. తీరం వైపు ముగ్గురు వ్యక్తుల బృందం వెళ్తోందని, వారు ఖచ్చితంగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మరియు ఆయన అనుచరులేనని సురాఖాకు తెలిసినప్పుడు, ఆ బహుమతిలో వేరెవరూ భాగస్వామి కాకూడదని భావించి ఆయన ఆ వార్తను దాచిపెట్టారు. సురాఖా తన వేగవంతమైన గుర్రాన్ని తెప్పించుకుని వారిని అనుసరించడం ప్రారంభించారు. ఆయన త్వరలోనే ఆ బృందం సమీపానికి చేరుకున్నారు. ఎంతగా అంటే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఖుర్ఆన్ పఠిస్తున్న స్వరం కూడా ఆయనకు వినిపించసాగింది. హజ్రత్ అబూ బకర్ (రజి) పదే పదే వెనక్కి తిరిగి చూస్తుండేవారు, కానీ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మాత్రం ఎటువైపు కూడా చూడకుండా సాగిపోతున్నారు. అంతలో సురాఖా గుర్రం ఊహించని విధంగా అడుగు తడబడి, దాని కాళ్ళు ఇసుకలో కూరుకుపోయాయి. ఆయన జోస్యం చూసుకోగా, అది ఆయన సంకల్పానికి వ్యతిరేకంగా వచ్చింది. అయినప్పటికీ బహుమతి ఆశతో ఆయన ముందడుగు వేస్తూనే ఉన్నారు. చివరికి గుర్రం కాళ్ళు ఇసుకలో పూర్తిగా కూరుకుపోవడంతో, ఈ వెంటాడటంలో తనకు ఎలాంటి మేలు జరగదని సురాఖా గ్రహించారు. దీంతో సురాఖా అభయం కోసం వేడుకుంటూ, తన వల్ల వారికి ఎలాంటి హాని జరగదని చెప్పారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ అబూ బకర్ (రజి)తో, అతనికి ఏమి కావాలో అడుగని చెప్పారు. సురాఖా తాను వారిని వెంటాడటానికి గల కారణాన్ని వివరిస్తూ, మక్కా వాసులు మీ ఇద్దరి కోసం బహుమతిని నిర్ణయించారని, ఆ ఆశతోనే తాను వచ్చానని చెప్పారు. అయితే తనకు ఎదురైన అనుభవాల వల్ల ఈ వెంటాడటం సరైనది కాదని తాను గ్రహించినట్లు తెలిపారు. ఆయన ప్రయాణానికి కావలసిన ఆహార పదార్థాలను, సామగ్రిని ఇస్తానని ప్రతిపాదించినప్పటికీ, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వాటిని స్వీకరించలేదు.

కేవలం మా గురించి ఎవరికీ చెప్ప వద్దని మాత్రమే అన్నారు. సురాఖా అందుకు మాట ఇచ్చి, తనకు అభయపత్రం కావాలని కోరారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశం మేరకు ఆయనకు అభయపత్రం రాసి ఇవ్వబడింది. ఒక కథనం ప్రకారం తిరిగి వెళ్ళేటప్పుడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సురాఖాను ఉద్దేశించి, ఓ సురాఖా! కిస్రా కంకణాలు నీ చేతుల్లో ఉన్నప్పుడు నీ పరిస్థితి ఎలా ఉంటుంది? అని అన్నారు. సురాఖా ఆశ్చర్యంతో కిస్రా బిన్ హుర్ముజ్ కంకణాలా? అని అడిగారు. దానికి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అవును, అదే కిస్రా బిన్ హుర్ముజ్ అని చెప్పారు. హజ్రత్ ఉమర్ (రజి) ఖిలాఫత్ కాలంలో కిస్రా కంకణాలు, కిరీటం, నడుము పట్టి తెచ్చి నప్పుడు, హజ్రత్ ఉమర్ (రజి) సురాఖాను పిలిపించి, ఆ కంకణాలను ఆయనకు తొడిగి ఇలా అన్నారు: సర్వ ప్రశంసలు అల్లాహ్‌కే చెల్లుతాయి. అతడు కిస్రా బిన్ హుర్ముజ్ నుండి వీటిని లాక్కొని, నీకు ప్రసాదించాడని చెప్పు.

హుజూరె అన్వర్ ఇట్లన్నారు: వనరులను ఏర్పాటు చేసుకోవడం, వాటిని ఉపయోగించడం, ఆ తర్వాత అల్లాహ్ తఆలాపై పూర్తి నమ్మకం ఉంచడం ఇదెంతో అవసరమైన విషయం. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నమ్మకం గురించి ప్రస్తావిస్తూ, ఈ అంశాన్ని హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి) ఈ విధంగా వివరించారు: అల్లాహ్ తఆలా ఉనికిపై నమ్మకం ఉండి, అలాగే తనను అతడు ఒక ప్రత్యేక లక్ష్యం కోసం సృష్టించాడని ఖచ్చితమైన విశ్వాసం ఉన్న వ్యక్తి కర్మలను వదిలిపెట్టి ఊరకే ఎలా కూర్చోగలడు? అతడే అందరికంటే ఎక్కువగా శ్రమించేవాడు అవుతాడు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కార్యచరణలు ఆయన విశ్వాసం నుండే ఉద్భవించాయి. ఎందుకంటే దేవుడు ఒక్కడేనని, అతడు తనను ఒక ప్రత్యేక ప్రయోజనం కోసం సృష్టించాడని గ్రహించిన ఏ వ్యక్తి అయినా, ఆ లక్ష్యాన్ని సాధించడానికి అహర్నిశలూ కృషి చేస్తాడు. కాబట్టి చూడండి, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఒకవైపు విశ్వాసాన్ని చాటుతూ, సౌర్ గుహలో ఉన్నప్పుడు హజ్రత్ అబూ బకర్ (రజి)తో అబూ బకర్! భయపడకు, అల్లాహ్ మనతో ఉన్నాడు, అతడే మన రక్షకుడని చెప్పారు. అదే సమయంలో మరొకవైపు, ధార్మిక కార్యక్రమాలలో రాత్రింబవళ్ళు ఎంత తీవ్రంగా నిమగ్నమై ఉండేవారంటే ఈ సృష్టికి సంబంధించిన పనులన్నీ అతనికే అప్పగించబడ్డాయా అన్నట్లుగా అనిపించేది.

కావున మానవునిగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఏ ఏ ఉపాయాలైతే చేయగలరో ఆ ఉపాయాలన్నిటిని ఉపయోగించేవారు. ఆ తర్వాత అల్లాహ్ తఆలాపైనే పూర్తి నమ్మకం ఉంచేవారు. కావున ఆయన విశ్వాసం అజ్ఞానంతో కూడుకు న్నది గానీ, సోమరితనంతో కూడుకున్నది గానీ కాదు. బదులుగా ఆయన విశ్వాసం ఆచరణాత్మక పరిశీలనతో కూడుకున్నది. అలాంటి అనుభవపూర్వక విశ్వాసం ఒకే సమయంలో దేవునిపై నమ్మకం, కార్యాచరణ రెండింటినీ సమన్వయం చేస్తూ, జంటగా ముందుకు తీసుకెళ్లే వ్యక్తికే సాధ్యమవుతుంది.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం తెలియజేస్తూ ఇలా అన్నారు: పవిత్ర మక్కాలో పద్నాలుగు సంవత్సరాల పాటు మన దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంపై వచ్చిన ఆ కష్టకాలపు చరిత్రను చదివితే చాలా స్పష్టంగా అర్థమవుతుంది. కష్ట సమయాల్లో ఒక పరిపూర్ణ సత్యవంతుడు ప్రదర్శించాల్సిన నైతిక గుణాలను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అద్భుతంగా ప్రదర్శించారు. అంటే అల్లాహ్ తఆలాపై నమ్మకం ఉంచడం, గందరగోళానికి దూరంగా ఉండటం, తన పనిలో సోమరితనం చూపకపోవడం, ఎవరి భయానికీ లొంగకపోవడం వంటి గుణాలను ఆయన ప్రదర్శించారు. ఆ స్థిరత్వాన్ని చూసి అవిశ్వాసులు కూడా విశ్వాసం ప్రకటించారు. దేవునిపై పరిపూర్ణ నమ్మకం లేనిదే ఎవరూ ఇంతటి స్థిరత్వాన్ని చూపించలేరని, ఈ విధంగా బాధలను భరించలేరని వారు సాక్ష్యమిచ్చారు.

హజ్రత్ ఉబై బిన్ కాబ్ (రజి) నుండి ఒక కథనం ఉంది: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం, అనుచరులు మదీనాకు వచ్చినప్పుడు, అన్సారీలు వారికి ఆశ్రయం కల్పించినప్పుడు, అరబ్బులందరూ వారికి వ్యతిరేకంగా ఏకమయ్యారు. ముస్లింల పరిస్థితి ఎలా ఉండేదంటే వారు ఆయుధాలు లేకుండా రాత్రి గడిపేవారు కారు, ఉదయం లేచేవారు కారు. దేవునిపై నమ్మకంతో పాటు, వారు ప్రతి క్షణం తమ ఆత్మరక్షణకు తగిన ఏర్పాట్లు చేసుకునేవారు.

హజ్రత్ ఆయిషా (రజి) తెలిపిన మరొక కథనంలో ఇట్లు గలదు. ఒక రాత్రి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మేల్కొని ఉండి, ఈ రాత్రి నా అనుచరులలో ఎవరైనా పుణ్యాత్ముడు నన్ను కాపలా కాస్తే బాగుండని అన్నారు. ఆ సమయంలోనే ఆయుధాల చప్పుడు వినిపించింది. అడగ్గా, తాను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంనకు రక్షణగా కాపలా కాయడానికి వచ్చానని హజ్రత్ సఅద్ బిన్ అబీ వక్కాస్ (రజి) చెప్పారు. మరొక కథనంలో సఅద్ మరియు హుజైఫా ఇద్దరూ వచ్చినట్లు ప్రస్తావన ఉంది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి కోసం దుఆ చేసి నిద్రపోయారు. అదే సమయంలో وَاللّٰهُ يَعْصِمُكَ مِنَ النَّاسِ (మరియు అల్లాహ్ ప్రజల నుండి నిన్ను కాపాడును) అనే ఖుర్ఆన్ సూక్తి అవతరించింది. దీని తర్వాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇక ప్రజలు వెళ్ళిపోవచ్చు, అల్లాహ్ తఆలా నా రక్షణ బాధ్యతను స్వీకరించాడని చెప్పారు. అల్లాహ్ తఆలా నుండి స్పష్టమైన హామీ లభించేంత వరకు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం బాహ్య రక్షణ ఏర్పాట్లను కొనసాగించారని, అల్లాహ్ తఆలా రక్షణ హామీ ఇచ్చాక ఆ కాపలాను తొలగించారని దీని ద్వారా తెలుస్తోంది.

హుజూరె అన్వర్ ఇట్లన్నారు: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వివిధ దేశాల రాజులకు ఇస్లాం సందేశాన్ని అందిస్తూ లేఖలు పంపినప్పుడు, కిస్రా అహంకారంతో ప్రవక్త గారి లేఖను ముక్కలు ముక్కలుగా చింపివేశాడు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంనకు ఈ విషయం తెలిసినప్పుడు, అల్లాహ్ తఆలాపై పరిపూర్ణ నమ్మకంతో, అల్లాహ్ తానే స్వయంగా ఈ ప్రజలను ముక్కలు ముక్కలు చేయుగాక అని అన్నారు. కిస్రా ప్రవక్త గారిని బంధించడానికి యెమెన్ గవర్నర్ ద్వారా ఇద్దరు సైనికులను పంపాడు. వారు వచ్చి తమ యజమాని ఆదేశాన్ని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంనకు తెలిపినప్పుడు, ఆయన ఎలాంటి ఆందోళనకు గురికాకుండా, ఈ రాత్రి ఇక్కడే ఉండండి, రేపు సమాధానం చెప్తానని అన్నారు. మరుసటి ఉదయం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారిని తిరిగి వెళ్ళిపొమ్మని చెప్తూ, ఈ రాత్రి నా ప్రభువు (అల్లాహ్) నీ ప్రభువును (కిస్రాను) అంతమొందించాడని చెప్పారు. ఆ తర్వాత తెలిసిన విషయమేమిటంటే సరిగ్గా అదే రాత్రి ఖుస్రో పర్వేజ్‌ను అతని కుమారుడు సైరస్ హత్య చేశాడు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యుద్ధాలకు వెళ్ళేటప్పుడు కూడా అల్లాహ్ తఆలా అనుమతితో, అతనిపైనే పరిపూర్ణ నమ్మకంతో బయలు దేరే వారు. బయలు దేరే సమయంలో ఇలా ప్రార్థించేవారు. اَللّٰهُمَّ أَنْتَ عَضُدِيْ وَأَنْتَ نَصِيْرِيْ وَبِكَ أُقَاتِلُ అర్థం: ఓ అల్లాహ్! నువ్వే నా భుజబలానివి, నువ్వే నా సహాయకుడవి మరియు నీ సహాయంతోనే నేను పోరాడుతున్నాను.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇలా ప్రవచించారు: కష్ట సమయాల్లో మనిషికి ఆందోళన కలగడం సహజమే అయినప్పటికీ, దేవునిపై నమ్మకాన్ని ఏ క్షణంలోనూ వదిలిపెట్టకూడదు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంనకు కూడా బద్ర్ యుద్ధ సమయంలో తీవ్రమైన ఆందోళన కలిగింది. అందుకే ఆయన ఓ నా ప్రభువా! ఒకవేళ నీవు ఈ చిన్న సమూహాన్ని నాశనం చేస్తే, ఇకపై ఈ భూమిపై నిన్ను ఆరాధించేవారెవరూ ఉండరని వేడుకున్నారు. అయితే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆందోళన కేవలం మానవ నైజానికి సంబంధించినది మాత్రమే. ఎందుకంటే మరోవైపు ఆయన నమ్మకాన్ని ఎంత మాత్రం వదిలిపెట్ట లేదు. ఆయన చూపు ఆకాశం వైపు ఉంది, అల్లాహ్ తఆలా తనను ఏమాత్రం వ్యర్థం చేయదని పరిపూర్ణ నమ్మకంతో ఉన్నారు. నైరాశ్యానికి, నిరాశకు ఆయన ఏమాత్రం చోటు ఇవ్వలేదు. మానవ నైతికతను, ఆధ్యాత్మిక హోదాలను పరిపూర్ణం చేయడానికి ఇలాంటి ఆందోళనలు రావడం అవసరం. కానీ మనిషి నైరాశ్యాన్ని తన దగ్గరకు రానివ్వకూడదు. ఎందుకంటే నైరాశ్యమనేది అవిశ్వాసుల లక్షణం. మనిషికి కలిగే రకరకాల ఆలోచనలు ఆందోళన అనే సంశయాన్ని కలిగిస్తాయి, కానీ విశ్వాసం ఆ సంశయాలను పటాపంచలు చేస్తుంది. మానవ నైజం ఆందోళనను ఆహ్వానిస్తే, విశ్వాసం దానిని నివారిస్తుంది.

అహ్జాబ్ యుద్ధ సమయంలో ముస్లింలు మదీనాలోనే ఉండి శత్రువును ఎదుర్కోవాలని నిర్ణయించుకున్నారు. ఇది దేవునిపై ఉన్న నమ్మకం తగ్గడం వల్ల కాకుండా, యుద్ధ వ్యూహంలో భాగంగా తీసుకున్న నిర్ణయం. శత్రువుల తక్షణ

దాడి నుండి రక్షణ పొందడానికి మదీనా చుట్టూ ఖందకం తవ్వబడింది. తీవ్రమైన పేదరికం, ఇబ్బందులు ఉన్నప్పటికీ ముస్లింలు ఆ ఖందక తవ్వకంలో పాల్గొన్నారు. అహ్జాబ్ యుద్ధ సమయంలోనే జరిగిన ఒక సంఘటన గురించి హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా అన్సారీ (రజి) కథనంలో ఉంది: ఖందకం తవ్వుతున్నప్పుడు ఒక గట్టి బండరాయి అడ్డొచ్చింది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం స్వయంగా దాన్ని పగల గొట్టడానికి సుత్తె తీసుకున్నారు; ఆ సమయంలో ఆకలి తీవ్రత వల్ల ఆయన కడుపుకు రాయి కట్టుకుని ఉన్నారు, పైగా మూడు రోజులుగా ఏమీ తినలేదు. హజ్రత్ జాబిర్ (రజి) ఇంటికి వెళ్లి కొద్దిగా బార్లీ, ఒక మేక పిల్లతో ఆహారాన్ని సిద్ధం చేశారు. వంట పూర్తయ్యాక దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను విందుకు ఆహ్వానించగా, ఆయన ముహాజిర్లు, అన్సారీలు అందరినీ తనతో పాటు తీసుకువచ్చారు. ఆ కొద్దిపాటి ఆహారంలోనే అల్లాహ్ తఆలా అపారమైన వృద్ధి ప్రసాదించగా, అనుచరులందరూ తృప్తిగా తిన్నారు. పైగా ఆహారం మిగిలిపోయింది కూడా. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ జాబిర్ (రజి) భార్యతో, ఇప్పుడు మీరు కూడా తినండి, ఇతరులకు కానుకగా పంపండి, ఎందుకంటే ప్రజలు చాలా ఆకలితో ఉన్నారని చెప్పారు. హునైన్ యుద్ధం గురించి హజ్రత్ బరా బిన్ ఆజిబ్ (రజి) వివరిస్తూ: ఒకానొక దశలో ముస్లింలు వెనక్కి తగ్గినప్పటికీ, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మాత్రం యుద్ధభూమి నుండి వెనకడుగు వేయలేదు. ఆయన తన తెల్లటి కంచరగాడిదపై స్వారీ చేస్తూ ఉండగా, అబూ సుఫ్యాన్ బిన్ హారిస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ దాని కళ్లాన్ని పట్టుకుని ఉన్నారు. ఆ సమయంలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ కవితను పఠిస్తున్నారు:

اَنَا النَّبِيُّ لَا كَذِبْ     اَنَا ابْنُ عَبْدِ الْمُطَّلِبْ

అర్థం: నేను ప్రవక్తను, ఇందులో ఎలాంటి అబద్ధం లేదు; నేను అబ్దుల్ ముత్తలిబ్ మనవడిని.

బద్ర్ యుద్ధ సమయంలో హబీబ్ బిన్ యసాఫ్ అనే ఒక శక్తి, ధైర్యవంతుడైన వ్యక్తి ముస్లింలతో కలిసి యుద్ధంలో పాల్గొనాలనుకున్నాడు. కానీ అప్పటికి అతడు ముస్లింగా మారలేదు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మా ధర్మాన్ని అనుసరించేవాడు మాత్రమే మాతో కలిసి యుద్ధానికి రాగలడని బదిలిచ్చారు. హబీబ్ బిన్ యసాఫ్ రెండవసారి, ఆ తర్వాత మూడవసారి కూడా వచ్చాడు. చివరికి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నీవు అల్లాహ్, అతని ప్రవక్తను  విశ్వసిస్తున్నావా? అని అడుగగా అతడు అవునని సమాధానమిచ్చాడు. దీంతో అతడు ముస్లింగా మారి యుద్ధంలో ఎంతో ధైర్య సాహసాలతో పాల్గొన్నాడు. ఎంతో అత్యవసరమైన పరిస్థితి ఉన్నప్పటికీ, హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్ తఆలా వాగ్దానాలపై పరిపూర్ణ నమ్మకంతో ఉండి, ఒక ముస్లిమేతరుని సహాయాన్ని స్వీకరించలేదని ఈ సంఘటన ద్వారా తెలుస్తోంది.

హజ్రత్ మసీహ్ మౌఊద్ (అ) ఇలా ఉపదేశిస్తున్నారు: నేటి కాలపు బుద్ధిమంతుల దృష్టిలో ఎవరినైనా శత్రువుగా చేసుకోవడం ఒక పొరపాటు, కానీ నిజం చెప్పాలంటే ఇది కూడా సత్యానికి ఒక సాక్ష్యం. దైవ ప్రవక్త (స) ఏ ఒక్కరితోనూ సమాధానపడి ఉండలేదు, అందరితోనూ వైరాన్ని కొనితెచ్చుకున్నారు. ఆ బుద్ధిమంతుల దృష్టిలో (నవూజుబిల్లాహ్) దైవ ప్రవక్త (స) పొరపాటు చేశారు. కానీ కేవలం దేవుని కోసమే అందరితోనూ వైరాన్ని వహించడం ఆయన సత్యసంధతకు ఒక స్పష్టమైన నిదర్శనం. దీని ద్వారా ఆయన విశ్వాస పటిమ ఏపాటిదో బోధపడుతుంది.

اَللّٰهُمَّ صَلِّ عَلٰى مُحَمَّدٍ وَّعَلٰى اٰلِ مُحَمَّدٍ وَّ بَارِكْ وَسَلِّمْ اِنَّكَ حَمِيْدٌ مَّجِيْدٌ

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ۔ وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ۔ وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ۔ عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِي الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ۔ يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ۔ اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ۔